ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కుమరం భీం జిల్లా వార్తలు



బుధవారం 7 ఫిబ్రవరి 2024



అడ్డుకట్ట

- ఎరువుల నిల్వల నమోదుకు ప్రత్యేక యాప్
- క్షేత్రస్థాయిలో అధికారుల విస్తృత తనిఖీలు
- వ్యాపారులు నిబంధనలు ఉల్లంఘిస్తే షాపు లైసెన్స్ రద్దు
- రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు
- కచ్చితమైన సమాచారం ఉండేలా పకడ్బందీ ఏర్పాట్లు

సాగు అవసరాలకు అనుగుణంగా ఎరువుల కొరత లేకుండా, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. క్షేత్రస్థాయిలో ఎరువుల దుకాణాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా ఎరువుల నిల్వలను తెలుసుకోవడం, పక్కా వివరాల నమోదు కోసం వ్యవసాయ శాఖ ఫర్టిలైజర్స్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం యాప్‌ను రూపొందించింది.

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 6: డీలర్ల వద్ద ఎరువులు ఉన్నా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తూ రైతులకు ఇబ్బందులకు గురిచేస్తున్న సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఇలా కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారుల ఆట కట్టించేందుకు వ్యవసాయశాఖ అధికారులు కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ఫెర్టిలైజర్ షాపుల్లో ఏ రోజు ఎంత మేర ఎరువుల నిల్వలు ఉన్నాయనే వివరాలను తెలుసుకునేందుకు వ్యవసాయశాఖ ఫైవ్ (ఫెర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం) యాప్‌ను తీసుకువచ్చింది. ఎరువుల దుకాణాల్లో కృత్రిమ కొరతను నివారించేందుకు ప్రభుత్వం వారంలో రెండు రోజులు దుకాణల్లో తనిఖీలు చేయాలని ఆదేశించింది. దీని ద్వారా ఎరువుల కొరతకు కారణాలేంటనే దానిపై పరిశీలించనున్నారు. క్షేత్ర స్థాయిలో లోపాలను గుర్తించి మరింత పారదర్శకంగా వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. ప్రత్యేక యాప్‌తో జిల్లాలోని 349 ఎరువుల దుకాణాలను పరిశీలించి అక్రమ నిల్వలపై, కృత్రిమ కొరతపై చర్యలు తీసుకోనున్నారు. సంబంధిత డీలర్లు ఎరువుల అమ్మకాలు, కొనుగోళ్లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయకుండా లెక్క తప్పితే వ్యవసాయశాఖ అధికారులు ముందుగా దుకాణ యాజమానికి నోటిసులు ఇస్తారు. అధికారుల తనిఖీల్లో పొరపాట్లు జరిగినట్లు తేలితే వెంటనే షాపు లైసెన్సు రద్దు చేసేలా ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. మిషన్ రిపేర్‌లాంటి సమస్యలు వచ్చినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి రిజిస్టలో నమోదు చేయాల్సి ఉంటుంది.

పక్కదారి పట్టించకుండా..

రైతులకు ఎరువుల కొరత లేకుండా చేసేందుకు ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. డీలర్లు ఎరువులను పక్కదారి పట్టించకుండా ఎప్పటికప్పుడు నిఘా ఉంటుంది. ఈ విధానం అమల్లోకి రావడంతో సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు పనితీరు కూడా మెరుగు పడుతుందని అభిప్రాయ పడుతున్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

వారంలో రెండు సార్లు..

వారంలో రెండు సార్లు వ్యవసాయశాఖ అధికారులు ఫెర్టిలైజర్ షాపుల్లో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించి వాటిని ఎఫ్ఐవీ యాప్‌లో నమోదు చేస్తారు. ఆయా షాపుల్లోని ఎరువుల బస్తాల వద్ద ఫొటోలు దిగి స్టాక్ రిజిస్టరులో సంతకం చేయడంతో పాటు ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గతంలోనే వ్యవసాయశాఖ ఎరువుల డీలర్ల షాపులను జీపీఎస్ ద్వారా ట్యాగ్ చేసింది. ఈ విధానం అందు బాటులో ఉండటంతో తనిఖీ చేసిన అధికారులు షాపు వద్ద ఉండి గూగుల్ ద్వారా ఫొటో దిగి లోకేషన్‌ను పంపించాల్సి ఉంటుంది. ఏవో, ఏడీఏ, డీఏవో స్థాయి అధికారులు నెలలో ఐదుసార్లు దుకాణాలు తనిఖీ చేయాలనే నిబంధన ఉంది. డీలర్లు పీవోఎస్ యంత్రాలను ఉపయోగిస్తున్నారా అన్న విషయం గుర్తించాలి. ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం నిర్వహణ ఉందో లేదో తెలియజేయాల్సి ఉంటుంది. జిల్లాలో ఎరువుల అమ్మకాలు, కొనుగోలు తీరును ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు.

యాప్‌లో నమోదు.. : రేవూరి శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి



జిల్లాలోని ఎరువుల షాపుల్లో స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఫెర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. వ్యవసాయశాఖ అధికారులు వారి పరిధిలోని ఐదు షాపులను వారంలో రెండు సార్లు విధిగా తనిఖీ చేయాలి. ఈ విధానం అమలుతో అధికారులకు బాధ్యత పెరగడంతో పాటు అక్రమాలకు, కృత్రిమ కొరతకు తావుండదు. ఏవో నుంచి డీఏవో వరకు తనిఖీ చేయాల్సి ఉంటుంది.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

- సమీక్షా సమావేశంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6: ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో -2024లో భాగంగా ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టరేట్ చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై మంగళవారం సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వ యంతో పని చేసి స్పష్టమైన జాబితా రూపొందించాలని అన్నారు. నూతన ఓటరు నమోదు కోసం 9,238 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. 8,829 దరఖాస్తులను అర్హులుగా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. ఓటరు జాబితా నుంచి తొలగింపు కోసం ఫారం.7 ద్వారా 7,551 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 7,424 దరఖాస్తులకు సంబంధించి నోటీసు లు జారీ చేసి తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 123 దరఖాస్తులు తిరస్కరించామని తెలిపారు. పేర్లు, చిరునామా సవరణలకు 4,496 దరఖాస్తులు రాగా 4,279 పరిష్క రించామని, 217 తిరస్కరించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6: ప్రసవాలు తప్పకుండా ఆసుపత్రిలోనే జరిగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతీ గర్భిణి వివరాలు సమీప ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాలు, ఆసుపత్రుల్లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారాంతో కలిసి వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణి వివరాలను నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తల ద్వారా వారి పరిధిలోని గర్భిణుల వివరాలు సేకరించి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



రెబ్బెనలో సమ్మె నోటీసును అందజేస్తున్న ఆశా వర్కర్లు

రెబ్బెన, ఫిబ్రవరి 6: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ కోరారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న చపట్టనున్న భారత్ బంద్ సమ్మె నోటీసును ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు మెడికల్ అధికారికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు రమ, సుకన్య, అనిత, స్వప్న, సుజాత, సునీత, లలితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: సీఐటీయూ సంఘం ఆధ్వర్యంలో క్యాజువల్ కార్మికులు ఈ నెల 16న చేపట్టను న్న దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం రైల్వే పీడబ్ల్యూ అధికారి మహి మీనాకు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్ కుమార్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 6: కేంద్ర ఓడరేవుల శాఖ మంత్రి శంతను ఠాకూర్, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను మంగళవారం ఢిల్లీలో ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. నియోజకవర్గంలో ఉన్న బెంగాలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో పలు రైళ్ల నిలుపుదల, స్టేషన్ ఆధునీకరణ, మూడో ట్రాక్ పనుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట నాయకులు హన్మంతరావు, ప్రముఖ వ్యాపార వేత్త ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

'అధిష్ఠానం అవకాశం కల్పించాలి'

చింతలమానేపల్లి/పెంచికలపేట, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదిలాబాద్ ఎంపీ టికెట్ తనకు కేటాయించాలని ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణ అన్నారు. మండల కేంద్రంతో పాటు రవీంద్రనగర్‌లో మంగళవారం ఆమె పర్యటించారు. ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదివాసీ బిడ్డగా తనను పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. కొన్నేళ్లుగా జిల్లాలోని ఆదివాసీ ప్రజల పక్షాన పోరాటం కొనాగిస్తున్నానని చెప్పారు. ప్రజా సేవలో ఉన్నందున కాంగ్రెస్ అధిష్ఠానం అవకాశం ఇస్తే పోటీకి సిద్ధమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, ప్రవీణ్, షహీద్, శ్రీనివాస్, శంకరయ్య, తపన్, మారుతి, రమేశ్, శేఖర్, మహేష్, చిన్నయ్య, మధుకర్, బాపూజీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిపై బాల్కసుమన్ వ్యాఖ్యలు సరికావు

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు సరికావని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఉన్నపుడు బాల్క సుమన్ చేసిన అక్రమాలు ఎక్కడ బయట పడతాయోనని భయపడి ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలకు దిగుతున్నారన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ నాయకుడు అజ్మీర శ్యాంనాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిపై బాల్క సు మన్‌చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చరణ్, గుండాశ్యాం, వసంత్, కాశయ్య, జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతర కమిటీ చైర్మన్‌గా ఆత్రం దౌలత్‌రావు

సిర్పూర్(యు), ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని మహాదేవ్ ఆలయంలో మంగళవారం జాతర కమిటీ చైర్మన్‌గా ఆత్రం దౌలత్‌రావు, వైస్ చైర్మన్‌గా సేడ్మకి బాపురావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతర ఏర్పాట్లపై నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి సిర్పూర్ (యు), ప్రెసిడెంట్‌గూడ, ఖాతిగూడ, దేవుగూడ, చిలాటిగూడ, భూర్నూర్, పాములవాడ, నేట్నూర్, కంచన్‌పల్లి, మహాగాం తదితర గ్రామాల ఆదివాసీలు హాజరయ్యారు. సమా వేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, ఆలయ పూజారి ఆత్రం శ్రీరావ్ రాజా, ఆత్రం దినకర్‌షా, సేడ్మకి బాధిరావు, ఆత్రం జ్యోతిరాం, ఆత్రం ఆనంద్‌రావు, గెడం భుజంగ్‌రావు, జంగు, నాగోరావు పాల్గొన్నారు.

పాఠశాల ఏర్పాటు చేయాలి

కెరమెరి, ఫిబ్రవరి 6: మండలంలోని ధనోర గ్రామ పంచాయతీ శివగూడ గ్రామంలో పాఠశాలను చేయాలని గ్రామస్థులు మంగళవారం పంచాయతీ ప్రత్యేకాధికారికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 12 మంది పిల్లలు ఉన్నారని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేషన్ షాపు ప్రారంభం

వాంకిడి, ఫిబ్రవరి 6: మండలంలోని సరండి గ్రామంలో మంగళవారం నూతన రేషన్ షాపును మాజీ సర్పంచ్ కమలాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నజీముద్దీన్, కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 6: జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు జాతీయస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చాటి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఆదివారం బెల్లంపల్లిలో ఇండియన్ యోగా స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో జూనియర్ విభాగంలో సాయి ప్రణతీ, దీపిక ప్రథమ స్థానం, హారిక ద్వితీయ స్థానం, సంహిత తృతీయ స్థానంలో నిలిచారని చెప్పారు. సీనియర్ విభాగంలో వర్షిణి, అంజలి, విద్య, ప్రతిభాబిశ్వాస్‌లు ప్రథమ బహుమతి సాధించారని తెలిపారు. అలాగే ఆసిఫాబాద్‌లో నిర్వహించిన టాలెంట్‌టెస్ట్‌లో జశ్వంత్ ప్రథమ, ఎస్ వేదాక్షర ద్వితీయ, మనస్వీని తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు.

వినికిడి యంత్రాలు ఉపయోగకరం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6: వినికిడి యంత్రాలతో ఎంతో ఉపయోగకరమని డీఈవో అశోక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు వుయి ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

లహరి బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6: ఆసిఫాబాద్ నుంచి ప్రతి రోజు హైదరాబాద్‌కు రెండు లహరి బస్సులను నడిపించనున్నామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసిఫాబాద్ నుంచి ఉదయం 9.30కు, రాత్రి 9.15కు, హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు ఉదయం 9, రాత్రి 8.30 గంటలకు ఉంటుందని తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదిన వేడుకలు



రెబ్బెనలో ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రెబ్బెన, ఫిబ్రవరి 6: రెబ్బెన మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేచేత కేక్ కట్ చేయించారు. అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సంతోష్, ఎంపీపీ సౌందర్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సంజీవ్‌కుమార్, ఎంపీటీసీలు మధునయ్య, శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు సోమశేఖర్, అహల్యా దేవి, సుమలత, వినోద, నాయకులు శంకరమ్మ, పద్మ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ రూరల్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదినం సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వ ర్‌రావు, వెంకన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండల కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోడసం భాగ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోడసం ధర్మరావు, మాజీ సర్పంచు ఆర్క నాగోరావు, ఆత్రం ఓంప్రకాష్, నాయకులు హామీద్‌ఖాన్, మడావి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండలంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు.. ఈ సందర్భంగా నాయకులు మండల కేంద్రంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చిర్లే లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల, ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్, నాయకులు మేస్రాం అంబాజీ, దయాకర్, ఆత్రం భీరావ్, ఉయిక హన్ను, ఉప సర్పంచ్ కుంర జంగు పటేల్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కుంర భగవంత్‌రావ్, గుగ్గె నాగనాథ్, నౌమాన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

వాంకిడి, ఫిబ్రవరి 6: జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో బుధవారం నుంచి ఈ నెల 15వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిం చాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం జిల్లాలోని 335 గ్రామపం చాయతీల్లో ఎనిమిది రోజుల పాటువివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. తొలిరోజు పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిం చేలా ప్రణాళికలు రచిస్తారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం కార్యక్రమం చివరి రోజు(ఫిబ్రవరి 15)న పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించి పనులపై అధికారులు సమీక్షించ నున్నారు.

● ప్రత్యేక కార్యక్రమాలు ఇలా..

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రపరిచేలా అవగాహన కల్పించాలి. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలను తొలగించాలి. ఉపయోగపడని బావులను పూడ్చివేయాలి. వినియో గంలో లేని బోరుబావులను మూసేయాలి. రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపర్చాలి. ప్లాస్టిక్ నిషే ధంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. దోమలు వృద్ధి చెందకుండా రసాయనం పిచికారి చేయాలి. శుక్రవారం ఇంటింటా డ్రై డేగా పాటించేలా ప్రజలను చైతన్యపరుచాలి.

యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 6: యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని సింగరేణి సిమిటార్ కార్యాలయాన్ని మంగళవారం చెన్నూరు ఎమ్మెల్యే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోసం పరిశీలించారు. స్థానిక జీఎం మనోహర్‌తో కలిసి ఆయన కార్యాలయంలోని గదులన్నిం టినీ పరిశీలించారు. ఇంకా ఖాళీగా ఉన్న భవనాల విషయంపై చర్చించారు. ఈ సంద ర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ధ్యేయంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని తాను సిమిటార్ కార్యాలయాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యువతి యువకులకు ఉపాధి అవకాశాలు పెంచాలనే లక్ష్యంతో ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు కాకా జ్ఞాప కార్థం పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించినట్లు తెలిపారు. త్వరలోనే స్కిల్ డెవల ప్‌మెంట్ సెంటర్లు ప్రారంభించి వృత్తి శిక్షణను ప్రారంభించనున్నామని వివరించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, తదితరులు ఉన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

కాసిపేట, ఫిబ్రవరి 6: అధికారులు, కార్మికులు సమిష్టి కృషితోనే ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అన్నారు. మంగళవారం కాసిపే ట 1గనిపై నిర్వహించిన మల్టీ డిపార్టుమెంట్ కమిటీ సమావేశంలో ఆయన మా ట్లాడారు. కార్మికులందరు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా అదనపు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలన్నారు. అధికారులు పనిస్థలాలను పర్య వేక్షిస్తూ కార్మికులు ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, కేకే గ్రూపు ఏజెంటు రాందాస్, అధికారులు ఫైడేశ్వర్, నాగరాజు, ప్రసాద్, రాంచందర్, రాజన్న , గనిమేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కసుమన్ దిష్టిబొమ్మ దహనం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శ్రీరాంపూర్ ఓసీపీపై ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, సీఎంకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, బాల్క సుమన్ డౌన్, డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో శీలం చిన్నన్న, బరపటి మారుతి, కాల్వ శ్రీను, జగన్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

● నేడు గనులపై నిరసనలు

సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో నిరసనలు చేపట్టనున్నట్లు కేంద్ర కమిటీ అడ్‌హక్ సభ్యుడు జెట్టి శంకర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమన్ దిష్టిబొమ్మలు దహనం చేయాలని, నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలుపాలని కార్యకర్తలకు సూచించారు.



బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్మికులు



'ప్రజావాణి'లో కార్మికుల వినతులు



వినతిపత్రాలు చూపుతున్న కార్మికులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 6: తమ వేతనాలు పెంచాలని, ఇతర డిమాండ్లు నెరవేర్చాలని కాంట్రాక్టు కార్మికులు హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడారు. పదేళ్లుగా కార్మికులు పనిచేస్తున్నా వారికి ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి సౌకర్యం, లాభాల వాటా, హై పవర్ కమిటీ వేతనాలు, బోనస్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంతెన లక్ష్మణ్, నేదూరి నర్సయ్య, నారాయణ, శంకర్, రాములు, రాజేందర్, పద్మ, రాజకళ, లక్ష్మి, జ్యోతి, సుగుణ, సాయమ్మ, దివ్య పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పీ 1 గనిపై సమావేశం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 6: శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్‌పీ 1 గనిపై మంగళవారం మల్టి డిపార్ట్‌మెంటల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్పత్తి, ఉత్పాదకతకు పాటుపడాలని మల్టి డిపార్ట్‌మెంటల్ కన్వీనర్, ఎస్ఓ టు జీఎం కె రఘుకుమార్ సూచించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏజెంట్ గోపాల్‌సింగ్ మాట్లాడుతూ, రక్షణతో కూడిన ఉత్పత్తి ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో గని మేనేజర్ విజయ్‌కుమార్, ఎస్ఈ(ఐఈడీ) కె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 6: మందమర్రి ఏరియా వర్క్‌షాపులో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆయన వర్క్‌షాపును సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్, నాయకులు పెద్దపల్లి బానయ్య, రాజేషం, మస్క భూమయ్య, సదాశివ్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేషం, వెంకట్రావ్, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డ నిందితుడికి జైలు శిక్ష

ఏసీసీ, ఫిబ్రవరి 6 : దాడికి పాల్పడ్డ నిందితునికి సంవత్సరం సాధారణ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ మంచిర్యాల రెండో అదనపు జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి సంపత్ తీర్పునిచ్చారు. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన కామెరపు సందీప్ మే 13, 2021న ఇంటి ముందు ఉండే శ్రీలత అనే మహిళను బండరాయితో తలపై కొట్టగా గాయాలయ్యాయి. అనంతరం సందీప్ అక్కడ నుంచి పారిపోయాడు. శ్రీలత సోదరుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు అప్పటి ఎస్ఐ కిరణ్‌కుమార్‌కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితున్ని కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో నిందితునికి మంగళవారం న్యాయమూర్తి శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు.

ట్రాక్టర్ యజమానుల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6: ట్రాక్టర్ యజమానుల సమస్యలను పరిష్కరించాలని బెల్లంపల్లి ట్రాక్టర్ యజమానులు కోరారు. మంగళవారం ట్రాక్టర్‌లు బం ద్ చేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇతర మండలాలకు చెం దిన ట్రాక్టర్ యజమానులు బెల్లంపల్లికి ఇసుక రవాణా చేస్తున్నారని, దీంతో జీవనోపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యల పరిష్కారానికి మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ట్రాక్టర్‌ల బంద్ చేపడుతున్నామని తెలిపారు. ఏ మండలానికి చెందిన ట్రాక్టర్‌లు అదే మండలంలో ఇసుక రవాణా చేసేందుకు మైనింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో ట్రాక్టర్‌లతో 200 మంది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయన్నారు. మురళీ, రామకృష్ణ, సతీష్, మధు,కుమార్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల అన్నం పెడుతున్నారని తల్లిదండ్రుల ఆందోళన

హాజీపూర్, ఫిబ్రవరి 6: ముల్కల్ల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన చేపట్టారు. తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ మోహన్‌తో వాగ్వాదానికి దిగారు. పిల్లలు తినే అన్నంలో పురుగులు రావడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకముందు ఇలా జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ మోహన్ తల్లిదండ్రులకు నచ్చజెప్పారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 6 : పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో కేంద్ర మంత్రి స్వర్గీయ కాకా వెంకటస్వామి పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ముందుగా కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతిప్రజ్వలన చేశారు. టాస్ వేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శరీరదారుఢ్యానికి దోహదపడతాయని, యువతలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. గడ్డం వంశీకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

నెన్నెల, ఫిబ్రవరి 6: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులేస్తోంది. సర్పంచుల పదవీకాలం ముగియడంతో పాలన బాధ్యతలను అధికారులకు అప్పగించారు. ఈ నెల 7 నుంచి 15 వరకు పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టనున్నారు. పంచాయతీల ప్రత్యేకాధికారులతో కలెక్టర్ బదావత్ సంతోష్, డీపీవో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో నరేందర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. ఎనిమిది రోజుల పాటు చేపట్టాలని, పనుల కోసం పంచాయతీల నిధులను వాడుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గాల అభివృద్ధికి కేటాయించిన కోటి రూపాయల నుంచి అత్యవసర పనులకు మాత్రమే నిధులను వాడుకోవాలని సూచించారు. యువత, మహిళా స్వయం సేవక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయనున్నారు. పారిశుధ్యంతోపాటు నీటి సరఫరా మెరుగుపర్చడమే లక్ష్యంగా రూపొందించారు.

-ఈ నెల 7 నుంచి 15 వరకు...

జిల్లాలో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సర్పంచుల పదవీ కాలం ముగిసిన అనంతరం మండల స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించి ఒక్కొకరికి రెండు, మూడు గ్రామ పంచాయతీలను అప్పగించారు. బుధవారం అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను గుర్తిస్తారు. సమస్య తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తిచేయనున్నారు. ఆఖరు రోజున గ్రామసభ ఏర్పాటు చేసి పనులపై సమీక్షించనున్నారు. పనులను డివిజన్, జిల్లా స్థాయి అధికారులు రోజు పర్యవేక్షించనున్నారు.

-ఉత్తమ పంచాయతీల ఎన్నిక

గ్రామ పంచాయతీల్లో ఎనిమిది రోజుల్లో చేపట్టిన పనుల ఆధారంగా ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేయనున్నారు. అంతర్గత రోడ్లు, పారిశుధ్యం, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, శుద్ధజలం, ఇంకుడు గుంతల నిర్మాణం అంశాలను పరిగణలోకి తీసుకుని ఆదర్శ పంచాయతీలుగా ఎంపిక చేయనున్నారు. పనులను సమీక్షించి మెరుగ్గా పని చేసిన పల్లెలను ఉత్తమ పంచాయతీలుగా సిఫారసు చేయనున్నారు. కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించి, ప్రశంస పత్రాలను అందజేయనున్నారు. మండల స్థాయిలో ఎంపిక చేసిన గ్రామాల నుంచి జిల్లా స్థాయి ఎంపిక చేస్తారు.

-నిధులే లేవు... పనులు చేసేదెలా...

నిధుల లేమితో గ్రామ పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. వారం రోజుల పాటు చేపట్టే స్పెషల్ డ్రైవ్‌లో పంచాయతీ నిధులతోనే పనులు చేపట్టాలని అధికారులు ఆదేశించడంతో స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. వివిధ అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్థిక సంఘం నిధులు 13 నెలలుగా రావడం లేదు. నెలల తరబడి పారిశుధ్య కార్మికులకు జీతాలు రాలేదు. ఒక్కో గ్రామ పంచాయతీకి ప్రతీ నెల రూ. 40 వేల నుంచి రూ. 80 వేల వరకు నిర్వహణ ఖర్చులు ఉంటాయి. నిధులు లేక అల్లాడుతున్న జీపీల్లో వారం రోజుల పాటు చేపట్టే పనులకు నిధులు ఎలా సమకూర్చుకోవాలో తెలియక మండల స్థాయి అధికారులు అయోమయంలో ఉన్నారు. నియోజకవర్గానికి కేటాయించిన కోటి రూపాయల నుంచి నిధులను అత్యవసరమైౖ తాగునీటి సమస్య పరిష్కారానికి మాత్రమే వాడాలని సూచించడంతో మిగతా పనులు ఎలా చేపట్టాలో తెలియడం లేదని అధికారులంటున్నారు. గ్రామాల స్వచ్ఛతే లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమానికి నిధులు కేటాయిస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవతున్నాయి.

రసాభాసగా బెల్లంపల్లి మున్సిపల్ సమావేశం




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6: బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మున్సిపల్ సమావేశం రసాభాసగా ముగిసింది. సమావేశానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరయ్యారు. సమావేశంలో పదవి కోసం పార్టీలు మారే మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత మాటలు నమ్మవద్దని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకువెళ్లారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కౌన్సిలర్లకు తెలియకుండా పలు విషయాల్లో అక్రమాలకు పాల్పడిందని, దీంతో పట్టణ అభివృద్ధి కుంటు పడిందని ఎమ్మెల్యేకు వివరించారు. పదవి పోతుందని కాంగ్రెస్‌లో చేరారన్నారు. కౌన్సిలర్ యూసుఫ్ అనారోగ్యంతో మృతిచెందగా డబ్బులు జమ చేసి చైర్‌పర్సన్‌కు అందజేస్తే కుటుంబానికి ఇవ్వలేదని ఎమ్మెల్యేకు తెలిపారు.

పట్టణ సమస్యలను పరిష్కరించాలని కౌన్సి లర్లు ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకు వెళ్లారు. పలు వార్డుల్లో తాగునీటి సమస్య ఉం దని, గోదావరి నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇండ్ల పట్టాలు పూర్తి స్థాయి లో అందజేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. నిర్మాణ దశలో ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇండ్లను లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. ఇండ్ల భవన నిర్మాణాలకు అనమతులు ఇవ్వాలన్నారు.

- చైర్‌పర్సన్ క్షమాపణ చెప్పాలని కౌన్సిలర్ల బైఠాయింపు

మున్సిపల్ సమావేశంలో చిల్లర కౌన్సిలర్లు అని మాట్లాడిన మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత కౌన్సిలర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ కౌన్సిలర్లు కింద కూర్చొని నిరసన తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరితే చిల్లర కౌన్సిలర్లు పేర్కొనడం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అలా మాట్లాడలేదని అలా మాట్లాడితే క్షమించాలని చైర్‌పర్సన్ కోరడంతో కౌన్సిలర్లు నిరసన విరమించారు. అనంతరం కౌన్సిలర్లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పట్టించుకోకపోవడంతోనే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశామని తెలిపారు. 20 మంది కౌన్సిలర్లం రాజీనామా చేసినప్పటికీ బీఆర్ఎస్ పార్టీ ఇప్పటి వరకు ఆమోదించలేదని తెలిపారు. మున్సిపల్ అవిశ్వాస తీర్మానం విషయంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య 20 మంది కౌన్సిలర్లను మోసం చేశాడని, ఈ విషయం అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 20 మంది కౌన్సిలర్లం ఏకతాటిపై ఉండి ఎన్నికల్లో ప్రభావం చూపుతామన్నారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల కన్నా బెల్లంపల్లి మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందుంచుతానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. పట్టణంలోని ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని సూచించారు. పార్టీలతీకతంగా కౌన్సిలర్లు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తాగునీటి సమస్య, ఇండ్ల పట్టాలు, ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు.



జంపన్నవాగులో యువకుడి గల్లంతు

మేడారం, ఫిబ్రవరి 6: వనదేవతల దర్శనానికొచ్చిన మేడారం వచ్చిన ఓ యువకుడు జంపన్నవాగులో గల్లంతైన సంఘటన మంగళవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగింది. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని దీపక్‌నగర్‌కు చెంది న పోలవేణి స్వాగత్(23) కుటుంబ సభ్యులతో కలిసి మేడారం వచ్చాడు. వనదేవతలను దర్శించుకున్న అనంతరం కుటుంబసభ్యులంతా జంపన్న వాగు జంట వంతెనల వద్ద విడిది చేసిన క్రమంలో స్వాగత్ రెడ్డిగూడెం కాజ్‌వే సమీపంలో ఉన్న పాలమడుగులో ఈతకు దిగి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సీఐ శంకర్, తహసీల్దార్ రవీందర్ సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. కానీ రాత్రి వేళ వరకు అతడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.



కార్మెల్ పాఠశాల సేవలు అభినందనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 6: కోల్ బెల్ట్‌లో విద్యావ్యాప్తికి కార్మెల్ పాఠశాల చేస్తున్న సేవలు అభినందనీయమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. మంగళవారం పాఠశాల 60వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ 60 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ పాఠశాల అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ విద్యార్థుల భవిష్యత్ ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేసిందన్నారు. నిత్యం విద్యార్థుల విద్యా బోధనకు ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలు బాగున్నాయన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు క్రమశిక్షణతో ఉండడంతో పాటు మంచి మార్కులు సాధిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. అత్యున్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో పోచయ్య, మున్సిపల్ కమిషనర్ రాజు, కరస్పాండెంట్ క్సేవియర్‌రెక్స్, జోసఫ్, పూర్వ విద్యార్థుల కమిటీ నాయకులు ఎండీ మునీర్, ఫాదర్‌లు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి

భీమిని, ఫిబ్రవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం వీగాం, వెంకటాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలతో పాటు అన్ని హామీ లను ప్రభుత్వం నెరవేస్తుందన్నారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వినోద్‌ను సన్మానించారు. మాజీ సర్పంచులు గట్టు తులసీరామాగౌడ్, దారిశెట్టి వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కన్నెపల్లి మండల అధ్యక్షుడు మాధవరపు నర్సింగరావు, మాజీ ఎంపీటీసీ దుర్గం ప్రభాకర్, కన్నెపల్లి వైస్ ఎంపీపీ రాకేష్ శర్మ, పంజాల రాజాగౌడ్, బీరయ్య, సత్యనారాయణ, ఎంపీడీఓ జవహర్‌లాల్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి, ఫిబ్రవరి 6: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వయం ఉపాధి శిక్షణ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుట్టు మిషన్, మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్, జ్యూట్‌బ్యాగ్ మేకింగ్, టూవీలర్, హౌజ్‌వైరింగ్, ఏసీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సీసీ టీవీ రిపేరింగ్, ఫొటో, వీడియో గ్రఫీ శిక్షణ ఉంటుందని తెలిపారు.. శిక్షణ కాలంలో ఉచిత భోజ నం, బస్సు చార్జీలు ఇవ్వనున్నామని తెలిపారు.

విద్యుత్ తీగలకు తగిలి ట్రాక్టర్ దగ్ధం

జన్నారం, ఫిబ్రవరి 6 : మండలంలోని తిమ్మాపూర్‌లో మంగళవారం ఉదయం గంధం చిన్ని అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్, గడ్డి విద్యుత్ తీగలకు తగలి దగ్ధమైంది. ట్రాక్టర్‌లో గడ్డిని తీసుకుని వెళ్తుండగా ప్రమాదవశాత్తూ తీగలకు తగిలి గడ్డికి మంటలు అంటుకున్నాయి. దీంతో గడ్డితో పాటు ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

సైన్స్‌పై అవగాహన

కన్నెపల్లి, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వాహకులు సంపత్, సాయికుమార్‌లు విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. మానవ శరీరంలోని అంతర్గత అవయవాల పనితీరును పరికరాల ద్వారా ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని కలిగి ఉండాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

కన్నెపల్లి, ఫిబ్రవరి 6 : మండలంలో పలు అభివృద్ధి పనులను మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. జన్కాపూర్, టేకులపల్లి, పోలంపల్లి, గొల్లగట్టు, సుర్జాపూర్ గ్రామాల్లో సుమారు రూ. 1.85 కోట్ల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం కన్నెపల్లి సబ్ స్టేషన్ నుంచి ముత్తాపూర్, రెబ్బెన, జజ్జరవెల్లి, జన్కాపూర్ వరకు బీటీ రోడ్డు పునర్ నిర్మాణపనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. నాయకులు మాధవ రపు నరసింహారావు, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

బెజ్జూరు, ఫిబ్రవరి 6: సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు చెప్పు తో కొడతానని మాట్లాడిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు శ్రీవర్ధన్ మాట్లాడుతూ బాల్క సుమన్ విచక్షణ రహితంగా మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో శంకర్, హకీం, హనుమంతు, శైలేష్, విష్ణు, పెంటయ్య, సత్తయ్య, గంతిరాం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి'

జైనూర్, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడ్మెత విశ్వనాథ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో, జైనూర్ సిర్పూర్(యు) మండలాల నాయకులు ఆత్రం దౌలత్‌రావ్, మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ ఇస్లామొద్దిన్, సీనియర్ నాయకులు సోయం మోతీరాం, మండాడి లింగు, పంద్ర షేకు, జైనూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యూబ్ ఖాన్, నాగోరావ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

సిర్పూర్(టి), ఫిబ్రవరి 6: ఆసుపత్రి సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని సిర్పూర్(టి) మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీఓ సురేష్ బాబు అన్నారు. మంగళవారం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆయన వెంట ఈవో కృష్ణమూర్తి, సిబ్బంది ఉన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి

పెంచికలపేట, ఫిబ్రవరి 6: కాగజ్‌నగర్ పట్టణంలో ఈ నెల 11న నిర్వహించే సీఐటీయూ బహిరంగ సభకు తరలి రావాలని సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త కార్మికసమ్మెలో భాగంగా సమావేశం నిర్వహించనున్నామని చెప్పారు. ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమాచారి, శిరీష, సుజాత, అనురాధ, చంద్రకళ, రాజమణి, శ్రీలత, పద్మ, లాలయ్య పాల్గొన్నారు.

దహెగాం: కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించే సీఐటీయూ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రమేశ్, సమత, శ్రీలత, కృష్ణమాచారి, వజ్రమ్మ, శోభ పాల్గొన్నారు.

డీలర్‌పై 6(ఎ) కేసు నమోదు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 6: జోర్‌పల్లికి చెందిన రేషన్ డీలర్ అక్లీం అహ్మద్ ఖురేషీపై 6(ఎ) కేసు నమోదు చేశామని డీటీ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కలెక్టర్‌కు డీలర్‌పై గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో రేషన్ దుకాణంను తనిఖీ చేసినట్లు తెలిపారు. 6 క్వింటాళ్ల బియ్యం ఎక్కువగా ఉండడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. దుకాణం నిర్వహణను మరో డీలర్ మల్లయ్యకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించామని ఆయన తెలిపారు.


కంటి వైద్య శిబిరానికి స్పందన

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 6: కాగజ్‌నగర్ కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో కొత్తపల్లి చంద్రయ్య వెంకటలక్ష్మి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా 45 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు.అవసరమున్న 11 మందికి కంటి శస్త్ర చికిత్స చేయనున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్త పల్లి శ్రీనివాస్, డాక్టర్ కొత్తపల్లి అనిత తెలిపారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ వసి, గోపి తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌క్రైంపై విద్యార్థులకు అవగాహన

కౌటాల, ఫిబ్రవరి 6: మండలంలోని ముత్తంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నాస్కం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైబర్ క్రైంపై ట్రైనర్ సునీత అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హనుమంతు పాల్గొన్నారు.







బీఆర్ఎస్‌కు షాక్..

- సొంత గూటికి చేరిన పెద్దపల్లి ఎంపీ
- కాంగ్రెస్ కండువా కప్పుకున్న వెంకటేష్ నేత
- పార్లమెంట్ పరిధిలో మారనున్న సమీకరణాలు



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో వెంకటేశ్‌నేత

మంచిర్యాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు, బీఆర్ఎస్ నేత బోర్లకుంట వెంకటేశ్‌నేత ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయం తరువాత పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండటంతో సిటింగ్‌లకు మొండి చేయి చూపే ఆలోచనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉన్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

ఈ క్రమంలో బీఆర్ఎస్‌లో కొనసాగితే టికెట్ రాదని భావించిన వెంకటేశ్‌నేత తిరిగి మాతృ సంస్థ కాంగ్రెస్‌లో చేరాలనే నిశ్చయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రేవంత్‌తో కలిసి సోమవారం రాత్రి ఢిల్లీ చేరుకున్న ఆయన తొలుత కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. అనంతరం కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఆయన మంగళవారం ఉదయం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను కలిశారు. వెంకటేశ్ నేత చేరికతో పెద్దపల్లి టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.

వెంకటేశ్‌నేత కాంగ్రెస్‌లో చేరడం వెనుక మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఆయన శిష్యుడిగా ఉన్న వెంకటేశ్‌నేత పీఎస్సార్ సూచనల మేరకే కాంగ్రెస్‌లో చేరినట్లు సమాచారం.

టికెట్ రేసులో సీనియర్లు....

పెద్దపల్లి పార్లమెంటరీ స్థానం షెడ్యూల్డ్ కులాలకు రిజర్వు కావడంతో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ పడుతున్న ఆ సామాజిక వర్గానికి చెందిన పలువురి పేర్లు తెరపైకి వస్తున్నాయి. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పేరు వినిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూరు నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన ఆయన చివరి నిమి షంలో గడ్డం వివేక్ వైపు పార్టీ మొగ్గు చూపింది. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్న అధిష్ఠానం హామీ మేరకు వివేక్‌కు మద్దతు ప్రకటించారు. ప్రస్తుతం ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నారు. గతంలో ఈ స్థానం నుంచి పోటీ చేసిన ఆగం చంద్రశేఖర్ మళ్లీ బరిలోకి దిగాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే వివేక్ కుమారుడు వంశీకృష్ణ కూడా పెద్దపల్లి పార్లమెంటు టికెట్ ఆశిస్తున్నారు. అసెంబ్లీ ఎన్ని కల్లో గడ్డం సోదరులిద్దరికీ టికెట్లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో వారి కుటుంబ సభ్యులకే టికెట్ ఇస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో నన్న ఉత్కంఠ నెలకొంది.

గ్రంథాలయాల అభివృద్ధి దిశగా చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 6: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌పై సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర అంచనా బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి గ్రంథాలయ సంస్థకు సెస్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రంథాలయాల్లో పుస్తకాలు, పత్రికలు, ఇతర మెటీరియల్ అందుబాటులో ఉండాలన్నారు. డీపీవో వెంకటేశ్వర్‌రావు, వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, విద్యాశాఖ సెక్టార్ అధికారి గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రాజు, అధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

భీమారం, ఫిబ్రవరి 6 : ఆరేపల్లి గ్రామంలో తిరుపతి పొలంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం శిక్షణ విద్యార్థి తిరుపతి భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పొలంలో ఎకరం భూమిలో నాలుగు నుంచి ఐదు చోట్ల 9 ఇంచుల లోతులో వీ ఆకారంలో మట్టిని తీసి వ్యవసాయాధికారులకు అందిస్తే భూమిలో ఎలాంటి పోషకాలు ఉన్నాయో తెలుసుకోవచ్చని తెలిపారు. రైతులందరు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు.

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో వీగిన అవిశ్వాసం

- నమ్మించి మోసం చేశారంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆరోపణ



అవిశ్వాస తీర్మానానికి హాజరైన ఆర్డీవో రాములు, సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 6: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. బీఆర్ఎస్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డిలపై సొంత పార్టీకే చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ ఇటీవల కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. దీంతో మంచిర్యాల ఆర్డీవో రాములు ప్రత్యేక అధికారి హోదాలో మంగళవారం అవిశ్వా సం కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అవిశ్వాసానికి మద్దతుగా తొలు త 17 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సంతకాలు చేయగా ఇటీవల ఏడుగురు కౌన్సి లర్లు కాంగ్రెస్‌లో చేరారు. మున్సిపాలిటీలో 22 వార్డులు ఉండగా కాంగ్రెస్ సభ్యు లు ఇద్దరు ఉండగా కొత్తగా చేరిన వారితో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 9కి చేరగా, బీఆర్ఎస్ నుంచి 13 మంది ఉన్నారు. కాగా ప్రత్యేక సమావేశానికి 13 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరు కాగా కాంగ్రెస్ సభ్యులు హాజరు కాలేదు. నూతన మున్సిపాలిటీ చట్టం ప్రకారం అవిశ్వాసం ప్రవేశ పెట్టేందుకు మొత్తం సభ్యుల సంఖ్యలో 2/3 వంతు కోరం ఉండాల్సి ఉంది. ఈ లెక్కన సమావేశానికి 15 మంది కౌన్సిలర్లు హాజరై బలం నిరూపించుకోవాల్సి ఉండగా కేవలం బీఆర్ఎస్‌కు చెందిన 13 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో ప్రత్యేకాధికారి రెండు సార్లు సమయం ఇచ్చినప్పటికీ గడువు ముగిసే సమయానికి కౌన్సిలర్లు హాజరు కాక పోవడంతో కోరం లేక అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. కాగా చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు సంబంధించిన రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. షెడ్యూల్ ప్రకారం మున్సిపాలిటీలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

అనంతరం బీఆర్ఎస్‌కు చెందిన 13 మంది కౌన్సిలర్లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానాన్ని ఏర్పాటు చేయాలంటూ ప్రకటించిన వారే స్వలాభం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. సజావుగా సాగుతున్న క్యాతన్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్‌ను ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలికి నమ్మించి మోసం చేశారంటూ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానం కోరం లేక వీగిపోవడంతో కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లతోపాటు 9 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. దీంతో ఆ పార్టీకి చెందిన చైర్‌పర్సన్ జంగం కళ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డిలు మాట్లాడుతూ క్యాతన్‌పల్లి అభివృద్ధి కాంగ్రెస్ ద్వారానే జరుగుతుందని, బీఆర్ఎస్ పార్టీ అవలంభిస్తున్న ఒంటెద్దుపోకడల కారణంగానే కాంగ్రెస్‌లోకి చేరామని, మున్సిపల్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

నస్పూర్‌లో భరోసా కేంద్రం ఏర్పాటు

వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించిన డీజీపీ



సీసీసీలో భరోసా కేంద్రంను ప్రారంభిస్తున్న ఏసీపీలు

నస్పూర్, ఫిబ్రవరి 6: సీసీసీ టౌన్‌షిప్ పాత పోలీస్‌స్టేషన్ భవనంలో మంగళవారం జిల్లా భరోసా కేంద్రాన్ని వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర డీజీపీ రవి గుప్తా, మహిళ రక్షణ విభాగం అడిషినల్ డీజీపీ షిఖా గోయల్, మల్టీజోన్-1 ఐజీపీ తరుణ్ జోషిలు ప్రారంభించారు. తెలంగాణలో ఎనిమిది జిల్లాల్లో భరోసా కేంద్రాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన కేంద్రాన్ని జిల్లా పోలీస్ అధికారులు ప్రారంభించారు. ప్రొజెక్టర్ ద్వారా భరోసా కేంద్రాల ఏర్పాటు, అందించే సేవలను డీజీపీ వివరించారు. అనంతరం ఏసీపీలు తిరుపతి రెడ్డి, మోహన్, సదయ్యలు మాట్లాడుతూ భరోసా కేంద్రం మహిళల రక్షణ, న్యాయసలహాలు, సమస్యల పరిష్కారానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏ విషయమైనా భరోసా కేంద్రాలకు వచ్చి చెప్పవచ్చానన్నారు. నిరంతర సేవలు అందించడానికి సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కేంద్రంలో న్యాయ సలహాలు, కౌన్సెలింగ్, వైద్య పరీక్షలు, మహిళా పోలీస్ అధికారి అందుబాటులో ఉంటారన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీలు సూచించారు. సీఐ ఆకుల అశోక్, మహిళా స్టేషన్ సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ సీఐ నరేష్, ఎస్ఐ రవి కుమార్, భరోసా కేంద్రం ఎస్సై ప్రేమలత, లీగల్ సపోర్టర్ నవ్యకృష్ణ, ఏఎన్ఎం ప్రమీల, రిసెప్షనిస్ట్ రజిత, పుష్పలతలతో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరులో సీఎం దిష్టిబొమ్మ దహనం

చెన్నూరు, ఫిబ్రవరి 6 : మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం ఆస్నాద చౌరస్తా తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ నేత, మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ధర్నాకు దిగారు. సీఐ రవీందర్ వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోటపల్లి వైస్ ఎంపీపీ వాలా శ్రీనివాసరావు, కిష్టంపేట మాజీ సర్పంచు రాకేష్ గౌడ్, చెన్నూరు మాజీ సర్పంచు కృష్ణతో పాటు కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

కేజీబీవీని పరిశీలించిన డీఈవో

తాండూర్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి విద్యార్థులకు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలోని వంట సామాగ్రిని పరిశీలించారు. మెను ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.

బాల్క సుమన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి బాల్క సుమన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో సుమన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.



మాట్లాడుతున్న చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, నస్పూర్‌లో సుమన్ దిష్టిబొమ్మ దహనం, మంచిర్యాలలో దిష్టిబొమ్మతో ఊరేగింపు

ఏసీసీ, ఫిబ్రవరి 6 : చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో బెల్లంపల్లి చౌరస్తా నుంచి ఐబీ చౌరస్తా వరకు సుమన్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి ఐబీలో దిష్టిబొమ్మను దహనం చేశారు. కేసీఆర్ మెప్పు కోసం కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. పూదరి తిరుపతి, పెంట రజిత, వసుంధర, గజ్జల హేమలత, వెంకటేష్, పుట్ట లావణ్య పాల్గొన్నారు. బాల్క సుమన్ సీఎంపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ప్రజల్లో అసహనం కలుగుతుందని ఎమ్మెల్యే గడ్డం వివేకానంద అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పరుష పదజాలంతో తిట్టే పద్ధతిని కేసీఆర్ మొదలు పెట్టారన్నారు. ఎంపీ వెంకటేష్ నేతతోపాటు చాలా మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బండి సదానందం, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంతో బీఆర్ఎస్ నేతలు భయంతో వణికిపోతున్నారని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకుల అక్రమాల గురించి చర్యలకు పూనుకోకముందే దీన్ని జీర్ణించుకోలేక అసహనంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని తెలిపారు. తమ నాయకుడు రేవంత్‌రెడ్డి దూషణలు ఏమి చేయలేదని, కేసీఆర్‌ను దూషిస్తావా అంటూ కల్లు తాగిన కోతిలా సుమన్ చిందులు వేయడం సిగ్గుచేటన్నారు. బాల్క సుమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు గుడ్ల రమేష్, బండి సదానందంయాదవ్, సొత్కు సుదర్శన్, ముజాహిద్, శేఖర్, మంద తిరుమల్, పాల్గొన్నారు.

బాల్క సుమన్ భరతం పట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పీసీసీ సభ్యులు నూకల రమేష్, సొత్కు సుదర్శన్‌లు పేర్కొన్నారు. బాల్క సుమన్ వాఖ్యలకు నిసరనగా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తప్పులు చేసిన బీఆర్ఎస్ నేతలకు తమ ప్రభుత్వంలో శిక్ష తప్పదని పేర్కొన్నారు. గడ్డం రజిని, నర్సింగ్, ఎండి పాషా, శ్రీనివాస్‌రావు, నూతన్, నర్సోజి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ దిష్టిబొమ్మను కోల్‌బెల్ట్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద ఐఎన్‌టీయూసీ నాయకులు దహనం చేశారు. దేవి భూమయ్య, సమ్మయ్య, నరేందర్ పాల్గొన్నారు. బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

హాజీపూర్: సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి ఊరేగించారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. సుమన్ బహిరంగంగా క్షమాపణలు చెప్పకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. డేగ బాపు, తోట రవి, శ్రీనివాసరావు, ఒడ్డె శ్రీనివాస్, సత్తయ్య, పాల్గొన్నారు.

జన్నారం: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బాల్క సుమన్ వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని లేకుంటే తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని కాం గ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ ఆలీఖాన్ పేర్కొన్నారు. జన్నారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్న బాల్క సుమన్ పద్ధతి మార్చుకోవా లని లేకుంటే ప్రజలేబుద్ధి చెబుతారని హెచ్చరించా రు.



బెల్లంపల్లిలో సుమన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నస్పూర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. బాల్క సుమన్ దిష్టిబొ మ్మను గాడిదపై ఉరేగించారు. సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు. బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. సుధాకర్, తాళ్ళ సంపత్ రెడ్డి, గెల్లు మల్లేష్, మధుకర్, వెంకటేశ్వర్ రావు, పాల్గొన్నారు.

చెన్నూరు: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆస్నాద చౌరస్తా తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం సుమన్‌పై చర్యలు తీసుకోవాలని సీఐ రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. సూర్య నారాయణ, అంకాగౌడ్, శ్రీధర్, బషీరోద్దీన్, పాల్గొన్నారు. దుగ్నేపల్లిలో సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

జైపూర్:ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్, జైనొద్దీన్, వెంకటేశం, ఎం. రమేష్, బేతు తిరుపతిరెడ్డి , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఓటమిని తట్టుకోలేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నాడన్నారు.

కోటపల్లి: బబ్బెరచెలక, లక్ష్మీపూర్, కోటపల్లి, మల్లంపేటలో మాజీ విప్ బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. శంకర్, దొబ్బల సంపత్, రాంరెడ్డి, కాత్రాల మల్లయ్య, సీతారాంరెడ్డి, ఆలూరి సంపత్,సత్యగౌడ్, మల్లికార్జున్, సంపత్ పాల్గొన్నారు.

తాండూర్: ఐబీ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నూరం రవీందర్‌రెడ్డి, రత్నాకర్‌రావు, యశోద, సుభాష్, దామోదర్‌రెడ్డి, శంకర్, జుబేర్, అనిల్ పాల్గొన్నారు.

కన్నెపల్లి: మండల కేంద్రంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. గడ్డల వెంకటేష్, నాగయ్య, శ్రీను, రాజన్న, లక్ష్మణ్, సంతోష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: కొండాపూర్ యాప వద్ద బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వేముల కృష్ణ, సిద్దం తిరుపతి, పర్వతి మల్లేష్, భీంరావు, వంశీధర్‌రావు, శ్రీనివాస్, సత్తయ్య, శేఖర్‌రావు, నర్సింగ్ పాల్గొన్నారు.

భీమిని: మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సంగర్సు రవీందర్ రావు, సతీష్, పోతురాజుల సురేష్, పొట్లపల్లి సత్తయ్య, హరీష్, చంద్రయ్య, పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేసిన ముఖ్యమంత్రి



మాట్లాడుతున్న చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 6: ఎన్నికలకు ముందు తెలంగాణకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో నాలుగు గ్యారంటీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదేనని మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు తెలిపారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతోపాటు రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తూ ప్రగతి కోసంపాటు పడుతున్న ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బాల్క సుమన్ మాయ మాటలు చెప్పి ఎంపీగా ఎన్నికయ్యాడని, డబ్బు సంపాదించుకొని చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచి అక్రమంగా వెయ్యి కోట్లు కూడబెట్టుకున్నాడన్నారు. అక్రమ ఇసుక దందా, కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేశాడన్నారు. బీఆర్ఎస్ నాయకులు వివక్షలు మానుకొని ప్రతిపక్ష పార్టీగా ప్రజల కోసం పని చేయాలని, బాల్క సుమన్‌ను పార్టీ నుండి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒడ్నాల కొమురయ్య, గుడ్ల రమేష్, మంద తిరుమల్, పైడిమల్ల నర్సింగ్, పాషా, ఎర్ర రాజు, ఇస్సాక్, జావేద్‌ఖాన్, పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 6: మంచిర్యాల పట్టణంలో ఛత్రపతి శివాజీ విగ్రహ స్థాపనకు స్థలం కేటాయించాలని మంగళవారం శివాజీ విగ్రహ సాధన సమితి సభ్యులు కర్ణకంటి రవీందర్, గణేష్, శ్రీనివాస్‌లు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. మూడేళ్ళుగా మంచిర్యాల పట్టణంలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతున్నామని తెలిపారు. ఈ నెల 19న ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా విగ్రహ స్థాపనకు స్థలం కేటాయించాలని విన్నవించారు. అరవింద్, ఉమేష్, రవీందర్,రాజ్‌కుమార్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

హాజీపూర్, ఫిబ్రవరి 6: జాతీయ కుష్టు నిర్మూలనలో భాగంగా మంగళవారం దొనబండ పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారులు కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్‌లు శివకుమార్, రాఘవయ్యలు మాట్లాడుతూ కుష్టు వ్యాధిని మందులతో నయం చేయవచ్చని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉచితంగా ఇస్తారన్నారు. చర్మంపై మచ్చలు ఏర్పడితే ఆసుపత్రులకు వెళ్లి చూపించుకోవాలన్నారు. అనంతరం కుష్టు వ్యాధి నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు, ఆశా కార్యకర్తలు రజిత, స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

జన్నారం, ఫిబ్రవరి 6: రోటిగూడ గ్రామానికి చెందిన ఉప్పుల లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు మంగళవారం ఉట్నూరులోని క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు రూ.4 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. నబ్బండ వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.

సమాచార చట్టం కమిటీ నియామకం

జైపూర్, ఫిబ్రవరి 6 :సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ 2005 యునైటెడ్ ఫోరం) జిల్లా కమిటీని మంగళవారం నియమించినట్లు జిల్లా కన్వీనర్ జీవన్‌జోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కో కన్వీనర్‌గా ప్రదీప్‌రెడ్డి, జైపూర్ మండల కన్వీనర్‌గా చిప్పకుర్తి సంపత్, జిల్లా కమిటీ సభ్యుడిగా తాటిపర్తి సాయికృష్ణలను నియమించినట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రచార కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కన్వీనర్ జీవన్‌జోయల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు బుగ్గ జాతర దుకాణాల వేలం

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6: మండలంలోని బుగ్గ రాజేరాజేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని ఈ నెల 8న మధ్యాహ్నం 12 గంటలకు ఆలయంలోని కల్యాణ మండపంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని ఆలయ ఈవో బాపురెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి, ప్రసాదాల విక్రయం, లైబజార్, వాహనాల పార్కింగ్ కోసం వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ. 20 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

భూములు కబ్జా కాకుండా చూడాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6: పట్టణంలోని ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఆర్డీవో హరికృష్ణకు వినతి పత్రం అందించారు. నిరుపేదలకు చెందాల్సిన భూములను కొందరు దళారులు లక్షల రూపాయల విలువ గల భూములను కబ్జా చేసి వాటిలో అక్రమ కట్టడాలు చేపడుతున్నారని, మున్సిపల్ అధికారుల అండదండలతో ఇంటి నెంబర్లు తీసుకుంటున్నారన్నారు. భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇద్దరు అటవీ అధికారుల సస్పెన్షన్

జన్నారం, ఫిబ్రవరి 6: కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో గల ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో పనిచేస్తున్న బీట్ అధికారులు అఫ్జల్‌ఖాన్, శ్రీధర్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కుమరంభీంఆసిఫాబాద్ జిల్లాలోని జోడేఘాట్ అటవీ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకుని విచారించగా ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం వల్లనే కలప అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించామని, ఇద్దర్ని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా

తాండూర్, ఫిబ్రవరి 6: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్పాజీ మహేందర్‌రావు మంగళవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిని చెప్పుతో కొడతానని అనడం సరైంది కాదని తెలిపారు. ముఖ్యమంత్రిని అలా అనడం తనను బాధించిందని అందుకే క్రమశిక్షణ లేనటువంటి పార్టీలో కొనసాగలేనని రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

మూసివేసిన రైల్వే ట్రాక్‌లు దాటవద్దు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 6: పట్టణంలో మూసివేసిన రైల్వే గేట్లను దాటవద్దని బెల్లంపల్లి రైల్వే ఎస్ఐ హరిబాబు సూచించారు. మంగళవారం పట్టణంలోని మూసివేసిన రైల్వే ట్రాక్ క్రాసింగ్‌ల వద్ద రైల్వే ట్రెస్‌పాస్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మూసివేసిన రైల్వే ట్రాక్ మార్గాన్ని దాటి రావడం ప్రమాదకరమని తెలిపారు. అలా వచ్చే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.